క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన



వంగర: ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన

వంగర: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని అరసాడ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై గురువారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త పెంకి విజయలక్ష్మిపండిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం ద్వారా మంచి ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన చేపట్టారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరరావు

రాజాం సిటీ: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు అన్నారు. గురువారం మండలంలోని అంతకాపల్లి గ్రామంలో వలంటీర్లు, వైద్యారోగ్య సిబ్బందితో సమావేశమైన ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై ఆరాతీశారు. ప్రతీ వలంటీరు తమకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి, ఎవరైనా అనారోగ్యంతో బాధపడితే వారి వివరాలు సేకరించి, వైద్యారోగ్య సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.చిన్నారావు, ఈవోపీఆర్డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

27న మహాజన సభ

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఈ నెల 27వ తేదీన సుగర్ కేన్ గ్రోయర్స్ సహకార సంఘ మహాజన సభ నిర్వహిస్తున్నట్లు సబ్‌డివిజనల్ సహకార ఇన్‌చార్జ్ అధికారి తోట జ్యోతిలక్ష్మి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సభకు సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

అలసత్వం వహిస్తే చర్యలు



రేగిడి: రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్యామలదేవి

రేగిడి: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శ్యామలదేవి హెచ్చరించారు. గురువారం మండలంలోని ఖండ్యాం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె సచివాలయం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలపై ఆరాతీశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులకు మధ్య అనుసంధానంగా సిబ్బంది ఉండాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, సేవచేయాలని, ప్రజాప్రతినిధులను గౌరవించాలని సూచించారు. ఏదైనా సమస్య పరిష్కారానికి సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ హేమసుందరరావు, పంచాయతీ కార్యదర్శి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

బొబ్బిలి: ఆశవర్కర్ల డిమాండ్ల సాధనకు అక్టోబరు 30వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమంను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కోరారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన ఆశవర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం చేపడుతున్న రక్షణ యాత్రకు తమ మద్దతు తెలుపుతున్నామన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్లు

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో పలువురికి కొత్తగా మంజూరైన పింఛన్లను గ్రామ సచివాలయ కన్వీనర్ గండి శంకరరావు చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం పథకాలు అందిస్తోందని, ప్రజలు గమనించి, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు బంకురు మోహన్‌రావు, చింతాడ పార్వతి, కార్యదర్శి బి.బంగారుబాబు పాల్గొన్నారు.

నవసమాజ మార్గదర్శి గురజాడ

గొప్ప సంఘసంస్కర్త, ప్రముఖ రచయిత, మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కవులు, సాహితీవేత్తలు, అధికారులు గురజాడ రచనల గొప్పతనాన్ని కొనియాడారు. అంటరానితనం, కన్యాశుల్కం, బాల్యవివాహాల నిర్మూలనకు ఆయన విశేషంగా కృషి చేసి, నవసమాజ నిర్మాణానికి ఎంతగానో పాటుపడ్డారన్నారు. ఆయన రాసిన దేశమును ప్రేమించుమన్న మంచియన్నది పెంచుమన్న దేశభక్తి గీతం దేశ ప్రజలందరిలో గొప్ప దేశభక్తి భావాన్ని పెంపొందించిందన్నారు. మనమంతా ఆయన అడుగుజాడల్లో నడిచి, కుల,మతాలకతీతంగా స్నేహభావంతో మెలగాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



బాడంగి: బాడంగి శాఖా గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న పాఠకులు



రామభద్రపురం: నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో గురజాడ చిత్రపటాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



బొబ్బిలి: గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న లోక్‌సత్తా పార్టీ నేత దామోదరరావు



తెర్లాం: తెర్లాం శాఖా గ్రంథాలయంలో గురజాడ జయంతిలో విశ్రాంత ఎంఈవో సత్యానారాయణ, లైబ్రేరియన్ కృష్ణమూర్తి



రాజాం సిటీ: గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు రంగనాథం



రేగిడి: లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురజాడ జయంతి

అసైన్డ్ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం

- రైతులకు శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీకి ప్రభుత్వం ఆదేశం
- ఆర్డీవో శేషశైలజ

రామభద్రపురం: కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న అసైన్డ్ భూముల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని బొబ్బిలి ఆర్డీవో శేషశైలజ అన్నారు. మండలంలోని దుప్పలపూడి, నరసాపురం, ఎస్.చింతలవలస రెవెన్యూ పరిధిలోని రైతుల సాగులో ఉన్న అసైన్డ్ భూములను ఆమె గురువారం పరిశీలించి, ఆ భూములు మొత్తం ఎంత మంది రైతుల సాగులో ఉన్నాయని తహసీల్దార్ రాజారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అసైన్డ్ భూములను సాగు చేస్తున్న రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు(పట్టాలు) ఇవ్వనున్నామని, ఈ మేరకు మండలాల



రామభద్రపురం: దుప్పలపూడి గ్రామంలో అసైన్డ్ భూముల రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో శేషశైలజ

పరిధిలో అసైన్డ్ భూములను సాగు చేస్తున్న రైతులను గుర్తిస్తున్నామన్నారు. పట్టాలు పొందిన రైతులకు సాధారణ రైతుల మాదిరిగానే ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో దుప్పలపూడి గ్రామ సర్పంచ్ వై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో బొబ్బిలి ఆర్డీవో శేషశైలజ గురువారం పర్యటించి, అక్కడి డీ–పట్టా భూములను సాగు చేస్తున్న రైతుల వివరాలపై ఆరాతీశారు. మండలంలో 50 ఎకరాల లోపు డీ–పట్టాలున్న గ్రామాలు 11 ఉండగా, 50 ఎకరాలు పైనున్న గ్రామాలు ఐదు ఉన్నాయని తహసీల్దార్ అజురఫీజాన్ తెలిపారు. 20 ఏళ్లు దాటిన(సాగులో ఉన్న) అసైన్డ్, డీ–పట్టాభూములకు సంబంధించి, ప్రభుత్వం శాశ్వత భూహక్కు పత్రాలు ఇవ్వనుందన్నారు. వీటితో సాధారణ రైతుల లాగే ప్రభుత్వ పథకాలు, రుణాలు పొందవచ్చన్నారు. ఆమె వెంట సర్వేయర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తెర్లాంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వైద్యారోగ్య సిబ్బంది

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయం దగ్గర ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి, శిబిరానికి హాజరైన రోగులను ఆయన, ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, ఏఎన్‌ఎం ప్రశాంతి, 104 వాహన డీఈఎం గోవింద్ ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ప్రతీ ఇంటికి వైద్యసేవలు అందుతున్నాయన్నారు.



బాడంగి: రోగుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యులు

ఆరోగ్య మేళాకు విశేష స్పందన..

బాడంగి: స్థానిక సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో గురువారం చేపట్టిన ఆయుష్మాన్ భవః ఆరోగ్య మేళాకు విశేష స్పందన లభించింది. మేళాకు హాజరైన దాదాపు 100 రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, మందులు, సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైద్యులు నాగేశ్వరరావు, అర్చన, రాఘవేంద్రరావు, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గండ్రేటి కేసరి ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి వారు మెడికల్ క్యాంప్ గురువారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఈసీజీతో పాటు జనరల్ చెకప్ చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రభు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో పరిశీలన



విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేటలో ఉన్న కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)ని ఎంఈవో జె.త్రినాథరావు గురువారం సందర్శించి, పాఠశాల రికార్డులు, స్టాక్ రూమ్‌లోని సరుకులు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అంచనా వేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మెనూ ప్రకారం రుచి, శుచితో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టాలని తెలిపారు.

రూ.9 కోట్లతో డబుల్ రోడ్డు పనులు



లచ్చారాయపురం దగ్గర చేపడుతున్న రోడ్డు పనులు

రేగిడి: రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి మండలంలోని సంకిలి వరకు రూ.9 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం రోడ్డు చదును పనులు చురుగ్గా చేపడుతున్నారు. బూరాడ జంక్షన్ నుంచి లచ్చారాయపురం మధ్య రోడ్డు లైనింగ్ పనులు జరుగుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



రేగిడి: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ

రేగిడి: ప్రకృతి సేద్యంతో ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని అంబఖండి గ్రామంలో పుర్లి లక్షునాయుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి, చేస్తున్న సాగును ఆయన పరిశీలించి, పరిసర పంట పొలాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, జీవామృతం వినియోగం పెంచాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం అనుసరిస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పైల తవిటినాయుడు, ఐసీఆర్‌పీ రమణ పాల్గొన్నారు.

శతశాతం ఈ–క్రాప్ బుకింగ్..

వంగర: గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ బుకింగ్(నమోదు) శతశాతం నమోదు చేయాలని ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. గురువారం మండలంలోని తలగాం గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు ఈ–క్రాప్ నమోదుపై సూచనలు చేశారు. ప్రతీ రైతు పంటలను ఈ–క్రాప్ బుకింగ్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఈ నెల 30వ తేదీలోగా శతశాతం మేర ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు.



వంగర: ఈ–క్రాప్ బుకింగ్ ప్రయోజనం వివరిస్తున్న ఏవో కన్నబాబు

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

బొబ్బిలి: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు వార్డుల వారీగా పర్యటిస్తున్నారు. గురువారం అప్పయ్యపేటలోని 14వ వార్డుకు వెళ్లిన ఆయన అక్కడి ప్రజలతో మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోయినా, ఏవైనా సమస్యలున్నా వెంటనే తెలియజేయాలని కోరారు. అలాగే నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట కౌన్సిలర్ శీర శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలి

తెర్లాం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తయిన ప్రతీ ఇంటి వద్ద లబ్ధిదారులతో ఇంకుడుగుంతల నిర్మాణాలను వేగవంతం చేయించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, ఉపాధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించాల్సిన పునాది(మట్టితీత) బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న చెత్త సంపద కేంద్రాల పనులు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధి ఏపీవో సుశీల, మండల హౌసింగ్ ఏఈ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు నిధులివ్వండి



- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: తెర్లాం మండలంలోని లోచర్ల, బొబ్బిలి మండలంలోని రాముడువలసల్లో ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో మాట్లాడిన ఆయన ఆయా ఎత్తిపోతల పథకాలతో రైతులతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. వాటి నిర్వహణ తీరుతెన్నులను కూడా ఆయన క్లుప్తంగా వివరించారు. అలాగే జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కుళాయిల నిర్మాణం జరుగుతోందని, కానీ మండల కేంద్రాలు, పెద్దపెద్ద గ్రామాల్లో టెండర్లు పూర్తయినప్పటికీ పనులు చేపట్టడం లేదన్నారు. వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా బొబ్బిలి సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందని, అలాగే ఆస్పత్రిలో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన వైద్యారోగ్య శాఖామంత్రి విడదల రజని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

ప్రజాఉద్యమాలతోనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకోగలం



అంబేడ్కర్ కూడలికి చేరిన సీపీఎం బైక్ ర్యాలీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

రాజాం సిటీ: ప్రజా ఉద్యమాలతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోగలమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం అన్నారు. ఇదే నినాదంతో విశాఖపట్నంలో ప్రారంభమైన బైక్ ర్యాలీ గురువారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి కాసేపు మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి వెన్నెముఖ లాంటి స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. దీనిని ప్రజలంతా ఉద్యమించి, వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణత్యాగం, 16 వేల మంది రైతులు 22 వేల ఎకరాల భూ త్యాగ ఫలితంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల మద్దతుతో ప్రైవేటీకరణ అంశాన్ని తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, రామ్మూర్తినాయుడు, సురేష్, రామారావు, జగన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



రాజాం: జెడ్పీ ఉన్నత పాఠశాల అసెంబ్లీని పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంఈవో యాగాటి దుర్గారావు తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల తెరిచే సమయానికి ఉపాధ్యాయులు చేరుకుని, విద్యార్థులతో నిర్వహిస్తున్న అసెంబ్లీలో పాల్గొన్నాలన్నారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుశాతంపై ఆరాతీశారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించి, మెనూ వివరాలు సేకరించారు. రుచి, శుచితో కూడి భోజనం విద్యార్థులకు పెట్టాలన్నారు. తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల వసతిని పరిశీలించి, ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి..

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవోలు ఎం.వి. ప్రసాదరావు, బి.ఎరకయ్య అన్నారు. గురువారం మండలంలోని కందిశ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన టీఎల్‌ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)ల వినియోగం, నూతన బోధనా పద్ధతులు అవలంభించడం, పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాల్లో పంచాయతీ ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



రేగిడి: ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాదరావు

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం



- ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టడం, దానిని అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయమని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఈ బిల్లు గత కేంద్ర ప్రభుత్వాలు ఏళ్లతరబడి పెండింగ్‌లో పెట్టాయని, ప్రస్తుతం కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించి, దానికి అన్ని పార్టీల మద్దతు వచ్చేలా, బిల్లు పాసయ్యేలా చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మహిళలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎంతగానో తోడ్పాటు అందుతోందన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ వర్తించేలా సీఎం జగనన్న చట్టం చేశారన్నారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ బిల్లుతో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. మహిళా బిల్లు ఆమోదం పొందడానికి కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, అన్ని పార్టీలకు తన తరపున కృతజ్ఞతలన్నారు.

పత్రిక ప్రకటన

ఇందుమూలంగా షుగర్ కేన్ గ్రోవర్స్ కో– ఆపరేటివ్ సొసైటీ లి., నెం.యు.200, బొబ్బిలి సంఘ సభ్యులకు తెలియజేయునది. ఏమనగా షుగర్ కేన్ గ్రోవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ, బొబ్బిలి సంఘ మహాజనసభ తే.27.09.2023దిన ఉదయం 11.00 గంటలకు గౌడ వీధి, బొబ్బిలి నందుగల సంఘ కార్యాలయ ఆవరణములో నిర్వహించుటకు నిర్ణయించడమైనది. అందుకు సంబంధించి తే.11.09.2023దీన సంఘమునందు గల సంఘ సభ్యులు చిరునామాల ఆధారముగా సంఘ మహాజన సభ నోటీసు సంఘ సభ్యులకు పంపించుట కూడా జరిగినది. ఇందు విషయమై పునియొకసారు తెలియజేయుట నిమిత్తము మరియు సంఘ సభ్యులందరూ విధిగా హాజరుగు నిమిత్తము ఈ పత్రిక ప్రకటన జారీచేయడమైనది. కావున సంఘసభ్యులు ఎవన్నంది సదరు సంఘ మహాజన సభకు విధిగా హాజరు కావలసినదిగా కోరడమైనది.

అజెండా అంశములు : 1)సంఘ పరిసమాప్తి గావించు విషయమై తగు నిర్ణయము గైకొనుట, మరియు ఇందుకు సంబంధించి పూర్తి వివరములతో సహకార సంఘముల డిప్యూటీ రిజిస్ట్రార్/ డివిజన్ సహకార అధికారి, విజయనగరం వారికి నివేదిక సమర్పించుట. 2)పర్సన్ – ఇన్–చార్జ్ వారి అనుమతితో ఇతర అంశములు పై చర్చించుట.

ఇట్లు.. సబ్ డివిజనల్ సహకార అధికారి, బొబ్బిలి
/పర్సన్ ఇన్–చార్జ్
షుగర్ కేన్ గ్రోవర్స్ కో –ఆపరేటివ్ సొసైటీ లి., బొబ్బిలి